క్లుప్తంగా

వచ్చే నెల 5న వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 5న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లు పైబడిన వారికి ఉచిత బోన్ డెన్సిటీ పరీక్షలు చేస్తామన్నారు. మోకాళ్ల, కీళ్ల నొప్పులు, కీళ్ల వాతం, ఎముక నొప్పి, సయాటికా నొప్పి, మధుమేహ, స్త్రీ సమస్యలు, అధిక బరువులతో పాటు అన్ని రకాల పరీక్షలు చేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ కార్యదర్శి బడుగు బాబి, కోశాధికారి ఏలేటి రమేష్, ప్రాజెక్ట్ చైర్మన్ బుర్రే కృష్ణమోహన్ పిలుపునిచ్చారు.

26న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: స్థానిక మున్సిపల్ పాలక మండలి సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 26న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య తెలిపారు. ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధి పనులపై చర్చించడానికి అజెండాలో 55 అంశాలను పొందుపర్చామన్నారు. వాటిపై చర్చించి కౌన్సిల్ సభ్యుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని అన్నారు. కౌన్సిల్ సభ్యులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలన్నారు.

స్వచ్ఛతపై అవగాహన పెంచుకోవాలి



స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేస్తున్న స్టేషన్ మేనేజర్ రమేష్

సామర్లకోట: స్వచ్ఛతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రయాణికులు, రైల్వే కాలనీ వాసులకు ఇంటింటా అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. నివాస ప్రదేశాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రయాణికులు ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వాడకాన్ని వీడాలన్నారు. ఈ మేరకు రైల్వే సిబ్బంది, విద్యార్థులతో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: పోషణ్ మహా కార్యక్రమాల్లో భాగంగా బుధవారం గొల్లప్రోలులోని మూడో అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ దుర్గాదేవి ఆధ్వర్యంలో పోషణ కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు థీమ్‌లో భాగంగా తల్లిపాల ప్రాముఖ్యత అనే అంశాలపై అవగాహన కల్పించి, గర్భిణులకు సీమంతాల కార్యక్రమాన్ని జరిపించి పోషణ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ మనసాదేవి తదితరులు పాల్గొన్నారు.

రూ.30 కోట్ల రుణాల అందజేత

సామర్లకోట: మండలంలోని నవర సొసైటీ ద్వారా రైతులకు రూ.30,88,62,995 రుణాలను అందజేశామని సొసైటీ సీఈఓ వీరంరెడ్డి కామేశ్వరరావు తెలిపారు. నవర, పవర, చంద్రంపాలెం గ్రామాలకు చెందిన 1,287 మంది రైతులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారన్నారు. పేరుకు నవర సొసైటీగా ఉన్నా సొసైటీ కార్యక్రమాలు నిర్వహించడానికి కార్యాలయం పవర గ్రామంలో ఉంది. రైతుల షేర్ ధనంగా రూ.2,54,18,241 ఉందని, 2023-24కు లాభంగా రూ.48,30,140 వచ్చిందని సీఈఓ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సొసైటీలో సభ్యత్వం కలిగిన రైతుల నుంచి డిపాజిట్లు స్వీకరించడంతో పాటు వారికి కావాల్సిన రుణాలు అందజేస్తున్నామన్నారు. ఈ మేరకు 261 మంది రైతులు 31,72,100 డిపాజిట్లు చేశారని తెలిపారు. 770 మంది రైతులకు పంట రుణాలుగా రూ.3,80,58,994, ఎల్ఈసీ రుణాలు 33 మందికి 14,50,075, ఎల్‌టీ రుణాలు 381 మందికి 6,09,59,263, ఎస్టీ ఇతర రుణాలు 197 మందికి రూ. 7,07,08,982, గోల్డ్ లోన్స్ 264 మందికి రూ.2,96,44,709, రెండు గ్రూపులకు రూ.రెండు లక్షలు, సొంత నిధి రుణం ఒకరికి రూ. మూడు లక్షలు ఇచ్చామని చెప్పారు. సొసైటీ చైర్మన్ తోట వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు నాగనబోయిన చంటిబాబు, గున్నాబత్తుల చెల్లారావు పాల్గొన్నారు.

అచ్చంపేటలో వైద్య శిబిరం

సామర్లకోట: స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట కాపు కల్యాణ మండపంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ జరిగింది. శిబిరాన్ని సర్పంచ్ వీరంరెడ్డి చినబాబు ప్రారంభించారు. రక్తపోటు, మధుమేహం, వివిధ క్యాన్సర్ పరీక్షలు చేశారు. సుమారు 450 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మణికుమార్ తెలిపారు. డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు.

ఎన్నాళ్లీ ముంపంట!

- నీట మునిగి కుళ్లిపోతున్న వరి చేలు
- పట్టించుకోని వ్యవసాయ అధికారులు
- ఎకరానికి రూ.15 వేల వరకూ నష్టం

సామర్లకోట: రైతు కష్టం నిండా మునిగిపోతోంది.. ఆరుగాలం శ్రమించి పండించిన పంట కళ్లెదుటే కుళ్లిపోతోంది.. ఏమీ చేయలేని అచేతన స్థితి పుడమి పుత్రుల్లో ఆవరించింది.. ఏటా ఇదే పరిస్థితి ఉన్నా అధికార యంత్రాంగంలో కదలిక లేకుంది..

సామర్లకోట మండలం పవర గ్రామంలో సన్న, చిన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న పంట భూముల పరిస్థితి ఇది. తరచూ చేలు నీట ముంపునకు గురవుతున్నా పట్టించుకునే నాథుడు కానరావడం లేదు. కత్తిపూడి నుంచి పవర మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి 216 రైతులకు శాపంగా మారింది. ఈ రహదారిని ఎత్తుగా నిర్మించడం, పంట భూముల్లోని అదనపు జలాలు పోయే మార్గం లేకుండా పోయింది. దీంతో వర్షాలకు రోడ్డు మార్జిన్‌లో కార్పొరేట్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పంట భూములు నీటిలో నానుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చేలల్లోకి నీరు చేరింది. భూముల్లో అదనపు జలాలు పంట కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్లాల్సి ఉంది. పంట కాలువలో పూడిక తీయకపోవడంతో నీరు లాగక, పంట భూముల్లోకే తిరిగి నీరు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 ఎకరాల వరకూ వరి పంట నీటిలో మునిగి కుళ్లిపోయింది. దీనికి సంబంధించి ఎకరం నుంచి అర ఎకరం వరకూ ఉన్న రైతులు 20 మంది వరకు ఉన్నారు. సన్న, చిన్నకారు రైతులు కావడంతోనే వీరిని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టామని, మొత్తం నష్టపోయామని రైతులు తెలిపారు. ప్రస్తుత తరుణంలో యూరియా వేయాల్సి ఉండగా, వర్షపు నీటికి వరి పంట కుళ్లిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.



చెరువు కాదు: ముంపునకు గురై కుళ్లిపోయిన వరి పొలం

అందరూ వచ్చే దారైనా..

పవర పంచాయతీ కార్యాలయంతో పాటు సచివాలయానికి వెళ్లే ప్రధాన రోడ్డు సమీపంలో ఈ పంట భూములు ఉంటాయి. అధికారులు ఎవరొచ్చినా ఇలాగే రావాలి. అయినా ఎవరూ ఇటు వైపు చూడడం లేదు. జాతీయ రహదారి దిగువ భాగంలో చిన్న తూరలు వేయడం, పంట కాలువలో పూడిక తీయక పోవడంతో తరచూ భూములు ముంపునకు గురవుతున్నాయని ఆ గ్రామ రైతులు నాగనబోయిన రాజబాబు, చంటి బాబు, వీరంరెడ్డి ఆనంద్ తెలిపారు. ముంపునకు గురైన భూములను వ్యవసాయాధికారులు ఇప్పటి వరకూ పరిశీలించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఈ భూములను కొంత మంది లేఅవుట్‌దారులు కొనుగోలు చేయడానికి పంట భూముల్లో నీరు బయటకు వెళ్లకుండా ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అధికారులు స్పందించి సన్న, చిన్నకారు రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



పూడికతీతకు నోచుకోని పంట కాలువ

రైతులకు న్యాయం చేయండి



వర్షాలు వచ్చిన ప్రతి సమయంలో పంట భూములు నీటిలో మునిగిపోతున్నాయి. ప్రస్తుతం వరి పంట పూర్తిగా కుళ్లిపోయాయి. ఇప్పటి వరకూ ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. పంట కుళ్లిపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలి.

– నాగనబోయన రాజబాబు, వైఎస్సార్ సీపీ పంచాయతీ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడు, పవర

ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



పొలాల్లో నీరు బయటకు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువలో పూడిక తీయాలని ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్తాం. ప్రస్తుత సీజన్‌లో ఒకసారి పంట ముంపునకు గురయితే రెండో పర్యాయం వరి నాట్లు వేసుకున్నట్లు తెలిసింది. ఈ ముంపు నివారణకు శాశ్వత పరిష్కారం కావాలి.

– వి.మురళీధర్, మండల వ్యవసాయాధికారి, సామర్లకోట

రుణాలను సద్వినియోగం చేసుకోండి



సదస్సులో మాట్లాడుతున్న మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రియంవద తదితరులు

సామర్లకోట: బ్యాంకుల నుంచి ఇస్తున్న రుణాలను వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం వీధి వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మున్సిపాలిటీలో వీధి వ్యాపారుల కోసం లోక కల్యాణ మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్టోబర్ 2 వరకూ జరిగే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతలో రూ.15 వేలు, రెండో విడతలో రూ.25 వేలు, మూడో విడతలో రూ.50 వేల రుణం ఇస్తామన్నారు. అయితే ఆయా విడతల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా ప్రతి నెలా క్యాష్ బ్యాక్ వస్తుందన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మాట్లాడుతూ వీధి వ్యాపారులు ఆరోగ్యకరమైన పద్ధతుల్లో ఆహారాన్ని తయారు చేసి విక్రయించాలన్నారు. ఎస్‌బీఐ మేనేజర్ సీతారామయ్య మాట్లాడుతూ పీఎం స్వనిధి, ముద్ర, పీఎం ఈజీపీ రుణాలపై అవగాహన కల్పించారు. పోస్టల్ డిపార్టుమెంట్ మేనేజర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థలో పలు పథకాలను వివరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, మెప్మా సిబ్బంది, పట్టణ వెండింగ్ కమిటీ ప్రతినిధులు, ఎస్ఎల్ఎఫ్ ఆర్పీలు, టీఎల్ఎఫ్ ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: పొన్నాడ శివారు కోనపాపపేట సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్‌పై మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరరావు బుధవారం తెలిపారు. కోనపాపపేట, మల్లివారితోట, రావివరపుపాడు, రామరాఘవపురం, రమణక్కపేట, నాగులపల్లిలో ఉన్న రొయ్యల చెరువులు, కోపపాపపేటలో హ్యాచరీస్‌లో ఉదయం 8 నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు.

ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ అడ్మిషన్లకు నెట్‌క్వాలిఫై అయిన వారితో భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని గోదావరి లైబ్రేరీ అసోసియేషన్ కార్యదర్శి కె.సాయిబాబు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఉన్న మిగతా యూనివర్సిటీలు నోటిఫికేషన్ విడుదల చేసి భర్తీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాయని, సాంకేతిక వర్సిటీలో అడ్మిషన్లు భర్తీ చేసి ఉన్నత విద్యకు అవకాశం కల్పించాలన్నారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

నమో అభయ రూపిణి..

- వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు
- కిటకిటలాడిన ఆలయాలు

పిఠాపురం: అమ్మవు నీవే... అఖిల జగాలకు అంటూ ఆ శక్తిరూపిణిని భక్తులు కొలిచారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. పిఠాపురం మండలం రాపర్తిలో కనకదుర్గాదేవి అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పిఠాపురం మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారు మూడో రోజు చంద్ర ఘంట అవతారంలో, దుర్గాడ శివాలయంలో లలితా మాత చిద్రూపి పరదేవత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని కుమారారామ భీమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన నిర్వహించారు. ఆలయంలో బాలాత్రిపుర సుందరిదేవి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లాకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్‌లు పూజాదికాలు నిర్వహించారు.



పాదగయలో అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారు



చంద్రఘంట అవతారంలో తాటిపర్తి అపర్ణాదేవి



గాజుల అలంకారంలో రాపర్తి కనకదుర్గాదేవి



చిద్రూపి పరదేవతగా దుర్గాడ లలితాదేవి



సామర్లకోట పంచారామ క్షేత్రంలో గాయత్రీదేవిగా అమ్మవారు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి



అన్నపూర్ణాదేవి అవతారంలో పెద్దాపురం మరిడమ్మ



కొమరగిరిలో గాయత్రీదేవిగా..

అన్నపూర్ణేశ్వరీ నమోస్తుతే..

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులు రాంబాబురెడ్డి, విజయలక్ష్మిల ఆధ్వర్యంలో అమ్మవార్లను అన్నపూర్ణదేవి అవతారంలో అలంకరించారు. స్థానిక వర్మలవారి వీధిలో వేంచేసిన శ్రీభువనేశ్వరి పీఠంలో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కొత్తపల్లి: స్థానిక శ్రీధర్మశాస్త్రా ఆలయంలో కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. కొమరగిరిలో శ్రీబాల కనకదుర్గాదేవి గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కార్మిక హక్కులను కాలరాస్తే సహించం



పని గంటల పెంపునకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కార్మికుల పని గంటల పెంపును అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జీపీటీ సమీపంలో మస్టర్ల కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తే సహించేది లేదన్నారు. ఉద్యోగ, కార్మికులపై పనిభారం మోసేందుకే ఈ పని గంటల పెంపు అని, దీనిని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యక్తులకు, బడా పారిశ్రామికవేత్తలకు అధాని, అంబానీలకు లాభం చేకూర్చేందుకు, వారికి కొమ్ముకాస్తూ కార్మికుల శ్రమను దోచిపెట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం పని గంటలను పెంచుతుందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతుందని అన్నారు. దీనిపై కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేంద్ర, లక్ష్మణ్, వీరబాబు, దుర్గా, మహేశ్వరి, కావయమ్మ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- రైతులను ఆదుకోవాలని డిమాండ్
- ఖాళీ సంచులతో ఎంపీటీసీల నిరసన

పిఠాపురం: మండలానికి అవసరమయ్యే యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఎంపీటీసీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు సరిపడా యూరియా అందించి ఆదుకోవాలని పిఠాపురం మండల ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కన్నాబత్తుల కామేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఠాపురం మండల ఎంపీటీసీ సభ్యులు ఖాళీ యూరియా సంచులతో నిరసన తెలిపారు. లైసెన్స్ షాపుల పేరుతో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని, ఇలా అధిక ధరలకు అమ్మకాలు సాగించి, రైతులను నిలువునా దోచుకుంటున్న దళారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం రైతులు క్యూలో వేచి ఉండే పరిస్థితిలో ఉన్నారని, తక్షణమే తగినంత యూరియాను అందించాలని కోరారు. పిఠాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి గంగాధర్ మాట్లాడుతూ మండలంలో 910 హెక్టార్లలో వరి, ఇతర పంటలు సాగవుతున్నాయని, ఇప్పటివరకూ 1,630 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం లేకుండా పోతుందని, మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి కనీసం అధికారులు హాజరు కాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఎన్ని సార్లు చెప్పినా ఏఒక్క అధికారి లెక్క చేయడం లేదని, గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ బడ్జెట్‌కు సంబంధించి నిధులు ఎంత ఖర్చు చేస్తున్నారో సభ్యులెవరికి తెలియడం లేదని, వాటి లెక్కలు చూపించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీఓ స్వప్న మాట్లాడుతూ అధికారులు కొంతమంది సెలవుపై వెళ్లారని, ఎక్సైజ్, పోలీస్, పీహెచ్‌సీ మల్లాం, ఏఈ నాడు- నేడు శాఖల అధికారులు మాత్రమే హాజరు కాలేదని సమాధానమిచ్చారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఖాళీ యూరియా సంచులతో నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కొత్తపల్లి: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాలని కొత్తపల్లి, నాగులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సుష్మ, సౌజన్య అన్నారు. కుతుకుడుమిల్లి శివారు పెద కలవలదొడ్డి, రమణక్కపేటలో బుధవారం స్వస్థ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కౌమార బాలికలు, 20 ఏళ్లు దాటిన మహిళలు ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు ఉన్నా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలన్నారు. 350 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వారు తెలిపారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

బోట్‌క్లబ్: సరస్వతీ గానసభ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా స్థానిక సూర్యకళా మందిరంలో మూడో రోజు బుధవారం చెన్నైకు చెందిన విఘ్నేష్ ఈశ్వర్ గాత్ర కచేరీ ఆకట్టుకుంది. శ్రీరాగంలో త్యాగరాజు స్వామి పంచరత్న కీర్తన ఎందరో మహానుభావులతో ప్రారంభించారు. ఆమె గాత్ర కచేరీకి వయోలిన్‌పై గాయత్రి శివాని, మృదంగంపై ప్రవీణ్, ఘటంపై సరస్వతుల హనుమంతరావు సహకారం అందించారు.

అనధికారికంగా మట్టి ఫిల్లింగ్ పనులు

కరప: అనుమతులు లేకుండా మూడు రోజులుగా సాగుతున్న మట్టి ఫిల్లింగ్ పనులను పంచాయతీ, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. వాహనాలను సీజ్ చేస్తామని హడావుడి చేశారు. ఈలోగా అధికార పార్టీ ప్రధాన నేత అనుచరులు ఫోన్ చేయడంతో ఆ వాహనాలను వదిలేసినట్లు తెలియవచ్చింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. కరప మండలం నడకుదురులో ఒక గ్యాస్ కంపెనీ గొడౌన్ నిర్మించడానికి పంట పొలాన్ని మెరక చేసే పని చేపట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అధికార పార్టీ మద్దతుతో మూడు రోజులుగా గ్రావెల్ తరలింపు పనులు జరిగిపోతున్నారు.

గ్రామానికి చెందిన కొంతమంది దీనిపై గ్రామ కార్యదర్శి వారిజకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్వోలు కె.గణపతి, వరుణ్, పంచాయతీ సిబ్బందితో కలసి అక్కడికి వెళ్లారు. అనుమతి లేకుండా గ్రావెల్ తోలడం ఏంటి, వాహనాలు సీజ్ చేస్తామన్నారు. గ్రావెల్‌తో మెరక చేసిన ప్రదేశంలో ఉన్న ట్రాక్టర్, గ్రావెల్ తీసుకొచ్చిన మూడు టిప్పర్లను అధికారులు స్వాధీనం చేసుకుని, కరప పోలీసులకు ఫిర్యాదు చేశారు. కరప ఎస్ఐ టి.సునీత స్పందించి కానిస్టేబుల్‌ను పంపించారు. అక్కడి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ఆ ప్రదేశంలో రెండు గంటల పాటు హైడ్రామా నడిచింది. జనసేన పార్టీకి చెందిన ఒక నాయకుడు ఫోన్ చేసి, ఎవరివో తెలుసుకోకుండా సీజ్ చేస్తారా అంటూ బెదిరించినట్లు సమాచారం. దీంతో వాహనాలను వదిలేసినట్లు తెలుస్తుంది. 85 సెంట్ల భూమిలో మెరక చేసే పనిని చేపట్టగా, ఇప్పటికే మూడు వంతులు పూర్తి చేశారు. కార్యదర్శి వారిజను వివరణ కోరగా నోటీసు ఇచ్చామని చెప్పి, మౌనం వహించారు.



నడకుదురులో అనధికార మట్టి ఫిల్లింగ్ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు

● అధినేతతో ఆత్మీయంగా...



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలసిన పిఠాపురం కోఆర్డినేటర్ గీతావిశ్వనాథ్, రాష్ట్ర కార్యదర్శి జమీల్, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు సూర్యనారాయణరాజు, పెద్దాపురం కోఆర్డినేటర్ దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, పిఠాపురం కోఆర్డినేటర్ వంగా గీతావిశ్వనాథ్ కలిశారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశం అనంతరం ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు దంతులూరి సూర్యనారాయణరాజు, పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు తదితరులు కలుసుకున్నారు.